శాసన మండలిలో మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

గారడీ మాటలు... దాగుడు మూతలు!

- మూసీ డీపీఆర్‌ను సర్కారు దాచే ప్రయత్నం
- ప్రివిలేజ్ నోటీసుతో బయటపడ్డ బండారం
- ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ విజయం: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్‌పై ప్రభుత్వం దాగుడు మూతలాడుతున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. సీవరేజ్ లైన్ల నిర్మాణానికి రూ.4100 కోట్ల డీపీఆర్ సమర్పించామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరమని విమర్శించారు. చిన్న భాగానికే అంత అవసరమైతే ప్రాజెక్ట్ మొత్తానికి ఎంతవుతుందని ప్రశ్నించారు. గురువారం శాసనమండలి మీడియా పాయింట్‌లో కవిత మాట్లాడుతూ ప్రభుత్వంపై ఇచ్చిన సభాహక్కుల నోటీసులకు సమాధానం చెప్పే సందర్భంలో మంత్రి శ్రీధర్‌బాబు గారడి మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. మూసీ ప్రాజెక్ట్ ముసుగులో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీసిందని ఆరోపించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లోని నిరుపేదల భూములను ప్రపంచబ్యాంకుకు అప్పగించేందుకే కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. ప్రపంచబ్యాంకు కోరడం వల్లే డీపీఆర్ సమర్పించామని మంత్రి చెప్పడంతో సర్కారు బండారం బయటపడ్డదని నిప్పులుచెరిగారు. ఇదీ ముమ్మాటికీ బీఆర్ఎస్ విజయమేనని స్పష్టం చేశారు.

చట్టం కాకముందే ప్రకటనలేందుకు?: మధుసూదనాచారి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి బిల్లుపై అసెంబ్లీలో చర్చ జరుగుతుండగానే పత్రికల్లో ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రకటనలేందుకు చేస్తున్నదని శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ సలహాదారులను నియమిస్తే విమర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఎందుకు పెట్టుకుంటున్నారని నిలదీశారు. ఆయన ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ మండలి నుంచి వాకౌట్ చేశామని చెప్పారు. ఈ ప్రభుత్వం రైతుబంధును ఎగ్గొట్టి నిండా ముంచిందని విమర్శించారు.

మూసీపై ఇచ్చింది డీపీఆర్ కాదు పీపీఆర్: శ్రీధర్‌బాబు వెల్లడి

మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు అంశంలో మంత్రి శ్రీధర్‌బాబు తప్పుడు సమాచారం ఇచ్చి, సభను తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌ను గురువారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అనుమతించారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు బీఆర్ఎస్ సభ్యులకు సమాధానం చెప్పారు. మంత్రి చెప్పిన సమాధానంపై ప్రివిలేజ్ మోషన్ పెట్టడం రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలోనే మొదటిసారి అని సభ్యులు పేర్కొన్నారు. మూసీ నదీ డెవలప్‌మెంట్‌పై పీపీఆర్(ప్రిలిమినరీ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారుచేశామని, ఆ విషయాన్ని వెబ్‌సైట్‌లో కూడా పొందుపర్చామని శ్రీధర్‌బాబు తెలిపారు. డీపీఆర్(డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్) ఇంకా సబ్మిట్ చేయలేదని, ప్రపంచబ్యాంక్ నిధులు ఇచ్చే అవకాశం ఉంటే తక్కువ వడ్డీకి తీసుకోవాలని అనుకుంటున్నామని చెప్పారు. ఇంకా ప్రపంచబ్యాంకును సంప్రదించలేదని స్పష్టంచేశారు. డీపీఆర్ సిద్ధమైన తర్వాత ఆ అంశాలను కచ్చితంగా సభ ముందు పెడుతామని వెల్లడించారు. మొత్తం డీపీఆర్ తయారు చేయడానికి ఆరు దశలు ఉంటాయని, ఇది కేవలం ప్రైమరీ దశ మాత్రమే అని వివరించారు.

దేవుళ్లపై ప్రమాణం మరచిన సీఎం

- రైతుబంధుపై హామీని నెరవేర్చని రేవంత్‌రెడ్డి
- శాసనమండలిలో కల్వకుంట్ల కవిత విమర్శలు
- ఆకుపచ్చ కండువాతో బీఆర్ఎస్ సభ్యుల నిరసన

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రైతుబంధుపై సీఎం రేవంత్‌రెడ్డి హామీని విస్మరించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. రైతుబంధు అంశంపై శాసనమండలిలో మాట్లాడిన కవిత సీఎం రేవంత్ దేవుళ్లపై ప్రమాణం చేసి హామీని మరిచారని మండిపడ్డారు. హామీని గుర్తుచేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఆకుపచ్చ కండువాలతో శాసనసభ, మండలికి వచ్చినట్టు చెప్పారు. రేవంత్‌రెడ్డి 2024 ఏప్రిల్ 20న ఏడుపాయల దుర్గమ్మపై, 21న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై, 22న బాసర సరస్వతి అమ్మవారిపై, 23న జోగులాంబ అమ్మవారిపై, 24న రామప్ప శివయ్య మీద, మే 9న ఆర్మూర్ సుద్దలగుట్ట దేవుడిపై ప్రమాణం చేసి, రైతుబంధుపై హామీ ఇచ్చారని వెల్లడించారు. దేవుళ్లపై ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డి హామీని నెరవేర్చకపోవడంపై నిరసన తెలియజేస్తున్నామని కవిత తెలిపారు.

జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగానే జీవో 317

- సమస్యలుంటే ప్రభుత్వం పరిష్కరించాలి
- శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత
- ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో మార్పులు చేయాలి: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తేతెలంగాణ): కొత్త జిల్లాల ఏర్పాటు మేరకే 317 జీవో తీసుకువచ్చామని, అందులో సమస్యలుంటే ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించవచ్చని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. 317 జీవోపై శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత, మంత్రి శ్రీధర్‌బాబు మధ్య ఆసక్తికర చర్చ సాగింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 317 జీవోను నాడు విమర్శించిన కోదండరాం, ఇప్పుడు రెండు, మూడు జిల్లాలపై మాత్రమే ప్రభావం పడిందని చెప్పున్నారని పేర్కొన్నారు. దీనిపై కోదండరాం మాట్లాడుతూ జీవో కారణంగా అన్ని జిల్లాల్లో సమస్యలు ఉత్పన్నమయ్యాయని, దీనికి కారణం 317(డీ) క్లాస్‌ను ప్రస్తావించకపోవడమేనని తెలిపారు. జోనల్ వ్యవస్థపై శాస్త్రీయత లోపించడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన వారే స్థానికత కోల్పోవాల్సి వచ్చిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ కేంద్ర హోంశాఖ నుంచి ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో మార్పులు చేయడమే 317 జీవో వివాదాలకు శాశ్వత పరిష్కారమని స్పష్టంచేశారు. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ప్రస్తుతం 317 జీవో రద్దు చేద్దామన్నా కొత్త సమస్యలు వచ్చే అవకాశమున్నదని వివరించారు. ఇప్పటికే దీనిపై సీఎం సబ్‌కమిటీ వేశారని, పలు సమస్యలను పరిష్కరిస్తూ ఈ కమిటీ ముందుకెళ్తున్నదన్నారు. ఇప్పటికే ఈ జీవోకు సంబంధించి పదుల దరఖాస్తులు పరిష్కరించామని చెప్పారు. మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ జీవోతో కొన్ని లాభాలు ఉన్నాయని, అయితే దీనిని కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

గురుకులాలను కాపాడుకుందాం

- వాటి కోసం జిల్లాకో కమిటీ వేయాలి
- బీఆర్ఎస్ సభ్యులకు కమిటీలో చోటివ్వాలి
- గురుకులాలు, స్కూళ్లలో వసతులు కల్పించాలి
- ఒక్క ఏడాదిలోనే 54 మంది పిల్లల మరణాలు
- పాలకుల పర్యవేక్షణలోపంతోనే ఈ దుస్థితి
- నాడు బడుగుల విద్యాభివృద్ధికి కేసీఆర్ విశేషకృషి
- శాసనమండలిలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్
- గురుకులాలు, ప్రభుత్వ స్కూళ్లపై సుధీర్ఘ చర్చ

శాసనమండలి నుంచి వాకౌట్ చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కవిత, సత్యవతి, వాణీదేవి, తాతా మధు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జిల్లాకో కమిటీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా కమిటీల్లో బీఆర్ఎస్ నేతలకు చోటు కల్పించాలని కోరారు. దళిత, గిరిజన, బీసీ విద్యార్థుల పట్ల మాజీ సీఎం కేసీఆర్‌కు ఎంతో అభిమానం ఉన్నదని, ఆ వర్గాల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రిగా విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం ఏడాది నుంచి కాంగ్రెస్ పాలకుల పర్యవేక్షణాలోపంతో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పలు సమస్యలు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఏడాది కాలంలో 54 మంది విద్యార్థులు మరణించారని తెలిపారు. గురువారం శాసనమండలిలో గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన అన్న అంశంపై రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన వసతుల కల్పన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యాన్ని సత్యవతి రాథోడ్ ఎత్తిచూపారు. ఆమెతోపాటు బీఆర్ఎస్ సభ్యులు పలు అంశాలను లేవనెత్తారు.

గురుకులాలను దిగజార్చిన కాంగ్రెస్

గురుకులాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దిగజార్చుతుందని సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ సభ్యులు ధ్వజమెత్తారు. 2014 కంటే ముందు ఎన్ని గురుకులాలు ఉన్నాయి.. 2023 నాటికి ఎన్ని గురుకులాలు ఏర్పాటయ్యాయో ఈ ప్రభుత్వం గ్రహించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు 54 మరణాలు జరిగాయని, ఆ మరణాలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వ గురుకులాల్లో పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని విమర్శించారు. విద్యాశాఖ, గురుకులాల్లో ఎన్నో సమస్యలు పేరుకుపోతుంటే వాటి పరిష్కారంపై దృష్టి పెట్టకపోగా, మంత్రిని కూడా నియమించకపోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి: వాణీదేవి

రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం బడ్జెట్‌లో 15 శాతం వరకు నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి శాసనమండలిలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో పిల్లల ప్రాణాలు పోతున్నాయని, ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు.

ఒకే గురుకులంలో వరుస పాముకాట్లా?: పోచంపల్లి

రాష్ట్రంలో ఒకే గురుకులంలోని విద్యార్థులను పాములు ఎందుకు కాటేస్తున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీశారు. గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందని ప్రశ్నించారు.

విద్యార్థుల సహాయకేంద్రం పెట్టాలి: తాతా మధు

గురుకుల విద్యార్థుల కోసం ఒక సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి గురుకులంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, వాటి గురించి పైఅధికారులకు తెలిపేందుకు, పరిష్కరించడం సులువు అవుతుందని సూచించారు. కేసీఆర్ హయాంలోనే విద్యారంగం బలోపేతమైందని గుర్తు చేశారు. అన్నివర్గాల శ్రేయస్సు కోరి పెద్ద మొత్తంలో కేసీఆర్ గురుకులాలను ఏర్పాటు చేశారని తెలిపారు.

గురుకులాల సరుకుల్లో కల్తీ: గోరటి వెంకన్న

విద్యా విలువలకు, సంప్రదాయాలకు జపాన్ మూలమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న శాసనమండలి చర్చ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలో గురుకులాలకు పంపే ఆహార సరుకుల్లో జోరుగా కల్తీ జరుగుతుందని, ముఖ్యంగా ప్యాకెట్ల కారం, పసుపు వంటి వాటిలో కల్తీ జరుగుతుందని విమర్శించారు.

మహిళా గురుకులాల్లో పురుషులొద్దు: సుభాశ్‌రెడ్డి

మహిళా గురుకులాల్లో పురుష ఉద్యోగులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, దానివల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి శాసనమండలి లఘు చర్చలో లేవనెత్తారు. పురుష సిబ్బందిని నియమించవద్దని సూచించారు. ఎన్‌ఆర్‌జీఈ నిధులను 50 శాతం విద్యాభివృద్ధి కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక పర్యవేక్షణాధికారులు ఉండాలి: నవీన్

రాష్ట్రంలో గురుకులాల అభివృద్ధి కోసం ప్రత్యేక పర్యవేక్షణాధికారులను నియమించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ శాసనమండలి చర్చ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గురుకులాలను బలోపేతం చేయాలని కోరారు. అందుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని సూచించారు. కేసీఆర్ హయాంలోనే విద్యాభివృద్ధి విశేషంగా జరిగిందని అభిప్రాయపడ్డారు.

మండలిలో బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

- సవరణ బిల్లుపై సీఎం ద్వంద్వ వైఖరి
- మండలి బీఆర్ఎస్‌పక్ష నేత మధుసూదనాచారి విమర్శ
- పెన్షన్ సవరణ బిల్లుకు శాసనమండలి ఆమోదం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నిరసనల మధ్యనే తెలంగాణ పేమెంట్స్ అండ్ సాలరీస్ పెన్షన్ సవరణ బిల్లు-2024కు శాసనమండలి ఆమోదం తెలిపింది. మండలిలో గురువారం పెన్షన్ సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో మండలి బీఆర్ఎస్‌పక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ సలహాదారుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నదని గతంలో విమర్శించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆయన ఎందుకు సలహాదారులను పెట్టుకున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ, సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ వాకౌట్ చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేసిన తర్వాత బిల్లు ఉద్దేశాలపై శ్రీధర్‌బాబు సభకు వివరించారు. అనంతరం బిల్లు మండలి ఆమోదం పొందింది.

బ్రోకర్లకు ప్రభుత్వమే కమీషన్

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): 400 ఎకరాల భూమిని టీజీఐఐసీ ద్వారా ప్రైవేటు బ్యాంకులకు తాకట్టు పెట్టి రూ.20 వేల కోట్ల రుణం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందుకు బ్రోకర్లకు 2-3 శాతం కమీషన్ ఇచ్చేందుకు కూడా నిర్ణయించిందని విమర్శించారు.

అప్పులు చేయడం నిరంతర ప్రక్రియ: మంత్రి

ఆస్తులు అమ్మడం, అప్పులు చేయడం నిరంతర ప్రక్రియ అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. నిధుల సమీకరణ కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. అవసరమైతే భూములను అమ్ముతామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అప్పుపై ఇవేం లెక్కలు?: అక్బరుద్దీన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిందని కాంగ్రెస్ పాలకులు ఏ లెక్కన చెప్తున్నారో వివరించాలని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాను ఏ లెక్కలు చూసినా, ఏ బడ్జెట్ పుస్తకం వెతికినా రూ.7 లక్షల అప్పు లెక్క తేలడం లేదని పేర్కొన్నారు.

రాజన్న కోడెలపై ఆరా

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- పది ఉమ్మడి జిల్లాలకు అధికారుల నియామకం
- వారంలోపు నివేదిక అందించాలని ఈవో ఉత్తర్వులు
- 'నమస్తే' వరుస కథనాలకు స్పందన

కరీంనగర్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతులకు పంపిణీ చేసిన రాజన్న కోడెల స్థితిగతులను తెలుసుకునేందుకు అధికార యంత్రాగం చర్యలు చేపట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు దేవాలయ ఈవో రంగంలోకి దిగారు. పది ఉమ్మడి జిల్లాలకు ఇద్దరు అధికారుల చొప్పున నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అధికారులు నేటి నుంచి కోడెల స్థితిగతులను తెలుసుకోనున్నారు. పూర్తి నివేదికను వారంలో సమర్పించాలని ఈవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్

రాజన్న కోడెల పంపిణీలో అక్రమాలు, కబేళాకు తరలింపు విషయాలపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తాజాగా నిర్వహించిన సమావేశంలో అధికారులపై సీరియస్ అయినట్టు తెలుస్తున్నది. కోడెల పంపిణీ కమిటీకి అధ్యక్షుడైన తనకే తెలియకుండా మూడో విడుత ఎలా పంపిణీ చేశారని ప్రశ్నించినట్టు సమాచారం. ఈనెల 7న 'రాజన్న కోడెలు కోతకు?!' శీర్షికన మొదలుపెట్టి.. 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో వరుస కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. ఇవి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. మంత్రి సురేఖ సైతం స్పందించారు. ఈ నేపథ్యంలో 17న కలెక్టర్ సందీప్‌కుమార్ తన చాంబర్‌లో వేములవాడ ఆలయ, గోశాల అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు 1975 పశువులను గోశాల నుంచి పంపిణీ చేశామని, మొదటి దశలో 1278 కోడెలు, 75 ఆవులు, రెండోదశలో 389 కోడెలు, 45 ఆవులు, మూడోదశలో 188 కోడెలు పంపిణీ చేశామని అధికారులు వెల్లడించారు. మూడో దశ పంపిణీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించినట్టు తెలిసింది. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు గత జూలై 3 నుంచి ఇప్పటి వరకు పంపిణీ చేసిన కోడెలు, ఆవుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అధికారుల టీఏ, డీఏలను బిల్లుల చెల్లింపు తర్వాత చెల్లిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనగా.. వాహనాల్లేకుండా ఎలా వెళ్తామని పలువురు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్టు తెలుస్తున్నది.

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

అసిఫాబాద్ జిల్లా కౌటాలలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

'అమిత్‌షా'పై ఆగ్రహ జ్వాల

- అంబేద్కర్‌పై కేంద్రమంత్రి వ్యాఖ్యలపై దుమారం
- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు.. దిష్టిబొమ్మల దహనం
- మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్
- ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆందోళనలు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 19: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత, ప్రజా సంఘాలు, బీసీ సంక్షేమ సంఘం, బీఆర్ఎస్, సీపీఎం, బీఎస్పీ, కాంగ్రెస్, స్వేరోస్ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్నాలు, రాస్తారోకో నిర్వహించి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. నిర్మల్ జిల్లాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో దళితులు, అంబేద్కర్ అభిమానులు అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. అంబేద్కర్‌ను అవమానిస్తూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నిర్వహించిన రాస్తారోకోలో పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు హేయం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్ వేదికగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు హేయమని దళిత్ రైట్స్, సోషల్ జస్టిస్ కోఆర్డినేషన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు కమిటీ సభ్యులు మల్లేపల్లి లక్ష్మయ్య, బీ వెంకట్, రామచంద్ర డోమ్, వీఎస్ నిర్మల్, గుల్జర్ సింగ్ గోరియా, ధీరేంద్రఝా, విక్రమ్‌సింగ్, కర్నెల్ సింగ్, బీనా పల్లికల్, సాయి బాలాజీ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ, బేషరతుగా క్షమాపణలను చెప్పాలని డిమాండ్ చేస్తూ నేడు దేశవ్యాప్తంగా ధర్నా చేపట్టాలని దళిత హక్కుల సంఘాలకు, ప్రజాస్వామిక సంఘాలకు కమిటీ పిలుపునిచ్చింది.

అంబేద్కర్ దేవుడులాంటివారు

- ఎమ్మెల్యే మాణిక్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను బీజేపీ ప్రభుత్వం అవమానించిందని, అమిత్‌షా వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. తక్షణమే అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గల్లీగల్లీనా అంబేద్కర్ విగ్రహాలు

- ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, ఆయన ప్రసాదించిన రిజర్వేషన్లతోనే తాను ఎమ్మెల్యే అయ్యానని అనిల్‌జాదవ్ తెలిపారు. గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహం అవసరమా? అని అమిత్‌షా అనడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. ఇందుకు నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా గల్లీగల్లీలో అంబేద్కర్ విగ్రహాలు నెలకొల్పుతామని తెలిపారు.

లోకం పోకడ

వీడు గురుకులానికెళ్లి పాఠాలు కాదుగానీ, పాములు పట్టడం నేర్చుకున్నాడు!

నేడు ఆటో డ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి

- తెలంగాణ ఆటో జేఏసీ పిలుపు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఉచిత బస్సు స్కీంతో సష్టపోతున్న ఆటోడ్రైవర్లను ఆదుకుంటామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు తీరుకు నిరసనగా శుక్రవారం అసెంబ్లీ ముట్టడి చేపట్టనున్నట్టు ఆటో జేఏసీ నాయకులు మారయ్య, సత్తి రెడ్డి, వెంకటేశ్ పేర్కొన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్లు హైదరాబాద్‌కు తరలొచ్చి ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఏడాదికి రూ.12వేలు ఇస్తామని మాటిచ్చి అమలు చేయకపోవడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సిటీ ఆటో యూనియన్, టీఎస్‌డీయూ తదితర సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

చెంచుల సంక్షేమంపై దృష్టి సారించాలి: మధుసూదనాచారి

రాష్ట్రంలో దుర్భర జీవితాలను గడుపుతున్న చెంచుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. భూపాలపల్లి, ములుగు, మంథని జిల్లాల్లోని చెంచులను కేంద్ర ప్రభుత్వం గుర్తించలేదు. వీరి జీవనం మిగితా ప్రాంతాల గిరిజనులతో పోలిస్తే దారుణంగా ఉన్నది.

ఏడాదిలోనే రూ.1.27లక్షల కోట్ల అప్పు: ఎమ్మెల్యే కేపీ వివేకానంద

ఏ పథకమూ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో రూ.1.27 లక్షల కోట్ల అప్పు చేసిందని, దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. నిబంధనలను బుల్డోజ్ చేసుకొంటూ సభ నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎన్టీఆర్ ఘాట్ జోలికొస్తే ఊరుకోం: ఎమ్మెల్యే మాగంటి

ఎన్టీఆర్ ఘాట్ జోలికొస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఘాట్‌ను తొలగిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని గోపీనాథ్ పేర్కొన్నారు.

ఐటీడీఏలను బలోపేతం చ